సాక్షి ప్రకాశం

బుధవారం । 31 । జూలై । 2024



ఇంతటి సంబరానికి అంతటి డప్పు !
తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం అంది స్తామని చెప్పి ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే చేతులెత్తేసింది.
- 8లో..



రెండు నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకుంటే..
వైపాలెం మండలం చిన్నకొలుకులలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
38/28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు మూడు విభాగాల్లో అవార్డుల కోసం సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులతో ఉన్న మండల స్థాయి కమిటీ వారు తదుపరి ఉప విద్యాశాఖ అధికారులతో ఏర్పాటైన డివిజనల్ లెవల్ కమిటీకి ప్రతిపాదనలు పంపాలని, వాటిని వారు పరిశీలించి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా డీఈవో కార్యాలయానికి పంపాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

ఒంగోలు:

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోసం 2024–25 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అతిత్వరలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన జిల్లాలో ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోదలచిన విద్యార్థులు తమ పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు, పాఠశాల రికార్డులలోను, ఆధార్‌కార్డులోను ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. వేర్వేరుగా ఉన్నట్లయితే సరిచేయించుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థికి తన ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ పథకం ద్వారా ఉపకార వేతనం జమచేస్తారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ విషయంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించి విద్యార్థులను ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు.

డ్వామా పీడీపై వచ్చిన ఆరోపణలపై విచారణ

ఒంగోలు టౌన్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జునరావు మీద వచ్చిన ఆరోపణలపై మంగళవారం జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ చాంబర్లో విచారణ జరిగింది. సాయంత్రం 7.45కి జేసీ చాంబర్లో మొదలైన విచారణకు హాజరైన అర్జునరావు రాత్రి గం.8.35కి విచారణ పూర్తయి బయటకు వచ్చారు. ఈ విచారణలో డ్వామాలో పనిచేస్తున్న నాలుగు కేడర్లకు చెందిన ఏపీవో, ఈసీ, కంప్యూటర్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వాటర్ షెడ్ సిబ్బంది సమక్షంలోనే విచారణ నిర్వహించినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఆయన ప్రతి మండలం నుంచి లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మొదటి నెలలో జిల్లాలోని 38 మండలాలకు చెందిన డ్వామా సిబ్బంది అంతా ఒక్కో మండలం నుంచి లక్ష రూపాయలు ముట్ట చెప్పుకున్నారు. అయితే మరుసటి నెలలో కూడా తలా లక్ష రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు ఉద్యోగులు రెండో నెలలో కూడా లక్ష రూపాయలు ఇచ్చుకున్నారు. మరి కొందరు డబ్బులు ఇవ్వకపోవడంతో వివిధ మార్గాల ద్వారా వారిపై వేధింపులు మొదలుపెట్టినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక పలువురు సిబ్బంది ఏకంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో అర్జునరావు అవినీతి బయటపడింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జాయింట్ గోపాల కృష్ణ విచారణ నిర్వహించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సమాచారం.



అప్పటికే రద్దీగా ఉన్న పూరీ ఎక్స్‌ప్రెస్‌ను ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రయాణం..ప్రహసనం

పూరీ బండి.. ఖాళీ లేదండీ..!

- తిరుపతి–పూరీ ఎక్స్‌ప్రెస్ అంటే హడల్
- రిజర్వేషన్ టికెట్ దొరకదు..జనరల్‌లో నిల్చునేందుకు చోటుండదు
- బాత్రూంలు..ఫుట్‌పాత్‌లపై తప్పని ప్రయాణం
- దుర్గంధభరితంగా బోగీలు
- కుటుంబంతో ప్రయాణం చేయడం సాహసమే
- ప్యాసింజర్ రైళ్లు లేక ఇబ్బందులు

అది తిరుపతి–పూరీ ఎక్స్‌ప్రెస్..జనరల్ బోగీల్లో ప్రయాణం నరకం..ప్రయాణికులు ఎక్కువ, బోగీలు తక్కువ.. ఆపై దుర్గంధ భరితంగా.. సీట్లు దొరక్క ఫీట్లు చేయాల్సిందే.. ఒంటికాలిపై నిలబడి..ఫుట్ పాత్‌లపైన, బాత్రూంల పక్కన కూర్చుని గంటలకొద్దీ ప్రయాణం.. ఇవన్నీ తలుచుకుంటే వామ్మో అనిపిస్తుంది. ఈ రైలు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఏసీ, స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ దొరకదు.. గత్యంతరంలేక 29 గంటల పాటు నానా అవస్థలు పడుతూ వెళ్లాల్సిందేనంటూ ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల అవస్థలను 'సాక్షి' బృందం మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది.

ఎప్పుడూ నిల్చుని ప్రయాణమే..



నేను వ్యాపార నిమిత్తం నెల్లూరు నుంచి ఒంగోలు వెళ్తున్నాను. ఈ రైలు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. నిల్చుని ప్రయాణించడమే తప్ప కూర్చొని వెళ్లే అవకాశం లేదు. ఈ రైలులో జనరల్ బోగీలు పెంచినట్లయితే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

– మున్నలూరి రాజా, నెల్లూరు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్/సింగరాయకొండ: రైలు ప్రయాణాలంటేనే చాలు ఒంగోలు ప్రయాణికులు హడలిపోతున్నారు. వచ్చే రైలు..పోయే రైలు అనే తేడా లేకుండా ఏ రైలు చూసినా కిటకిటలాడుతుంది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి సుమారు వంద రైళ్లకు పైగా రాకపోకలు సాగిస్తున్నా ప్యాసింజర్ రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లే కావడంతో జనరల్ బోగీలు లేక ఒక్కో బోగిలో వందల సంఖ్యలో ప్రయాణికులు ఎక్కేస్తున్నారు. దాంతో కూర్చోవడం సంగతి దేవుడెరుగు కనీసం నిల్చోవడానికి కూడా చోటు లేక ఒంటికాలి మీదే ప్రయాణాలు చేస్తున్నారు. ఒంగోలు నుంచి ప్రతిరోజు కనీసం 7 నుంచి 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారని అంచనా. తిరుపతి నుంచి పూరీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యాహ్నం గం.3.04 నిమిషాలకు రావాల్సి ఉంది. అయితే ఏ రోజూ సమయానికి రాదు. మంగళవారం సాయంత్రం 4.07 గంటలకు వచ్చింది. రైలులో అప్పటికే జనరల్ బోగీలు కిక్కిరిసిపోయాయి. వాటిల్లో ఎక్కేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

ఈ రైలు తిరుపతిలో ఉదయం 10.40 గంటలకు బయలు దేరి తరువాత రోజు మధ్యాహ్నం 2.35 గంటలకు పూరీకి చేరుకోవాల్సి ఉంది. ఇందులో ఆరు ఏసీ బోగీలు, తొమ్మిది స్లీపర్ క్లాస్ రిజర్వేషన్ బోగీలు ఉన్నాయి. సుమారు 29 గంటలు ప్రయాణించే ఈ రైలులో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రయాణించడానికి కేవలం మూడు జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒక బోగీ ఇంజన్ వైపు ముందు భాగంలో ఉండగా రెండు జనరల్ బోగీలు గార్డు వైపు ఉంటాయి. ఈ రైలులో తిరుపతిలో బయలుదేరే సమయానికే మూడు జనరల్ బోగీలు నిండిపోతాయి. ఆ తరువాత స్టేషన్‌లో ఎక్కే ప్రయాణికులకు ఒంటికాలు ప్రయాణమే. కొన్ని సందర్భాల్లో నిలుచుకునే పరిస్థితి కూడా ఉండదు. బాత్ రూములు, ఫుట్ పాత్‌లపైనా కూర్చుని ప్రయాణం చేయాల్సిందే. ఈ రైలు ప్రధానంగా తిరుపతి, కాళహస్తి, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, అన్నవరం, విశాఖపట్నం మీదుగా పూరి స్టేషన్ చేరుకుంటుంది. ఇన్ని ప్రధాన పట్టణాల గుండా వెళ్లే ఈ రైలులో మాత్రం జనరల్ బోగీలు తక్కువగా ఉండటం సామాన్య, మధ్య తరగతి వారికి ప్రయాణం నరకమే. రైలులో ప్రయాణించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు తెలియజేసేందుకు సింగరాయకొండ నుంచి ఒంగోలు వరకు 'సాక్షి' బృందం ప్రయాణించింది. జనరల్ బోగీల్లో ప్రయాణికులు బల్లలపై కూర్చొనే వీలు లేక కింద కూర్చున్నారు. మరి కొందరైతే ప్రాణాలకు తెగించి ఫుట్‌పాత్ లపై కూర్చొని ప్రయాణిస్తున్నారు. దీనికి తోడు బాత్‌రూమ్‌లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అలాగే ముక్కు మూసుకుని ప్రయాణికులు బాత్‌రూమ్ ఉపయోగిస్తున్నారు. కొంతమంది ప్రయాణికులు అయితే దుర్వాసన వస్తున్నా చేసేది లేక బాత్‌రూమ్‌ల వద్దే పడుకుని వెళ్తున్నారు. ఈ విధంగా నానా అవస్థలు పడుతూ ప్రయాణించడం పరిపాటేనని ప్రయాణికులు వివరించారు. తిరుపతి నుంచి పూరీకి వెళ్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రయాణికుడు అయితే తాము రిజర్వేషన్ కోసం ప్రయత్నించామని కానీ దొరకలేదని దీంతో చేసేది లేక జనరల్ బోగీలో అంతదూరం ప్రయాణించాల్సి ఉందని వాపోయాడు. కేంద్రప్రభుత్వం ఎంతసేపటికీ ఉన్నత వర్గాల వారికి అనుకూలంగా వందేభారత్, రాజధాని, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయాణించే రైళ్లను పట్టించుకోవడం లేదు. అంతేకాక ఇటీవల కాలంలో పేదవానికి అనుకూలంగా ఉంటే ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను బాగా తగ్గించారు. గతంలో ప్యాసింజర్ రైలుకు సింగరాయకొండ నుంచి విజయవాడ వెళ్లాలంటే రూ.35, ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీ రూ.70 ఉండేది. గత సంవత్సర కాలంగా ప్యాసింజర్ రైలు చార్జీని సైతం రూ.35 నుంచి రూ.70కి పెంచింది. దీంతో ప్యాసింజర్ రైలులో ప్రయాణించినా, ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించినా ఒకే రకం చార్జీ భరించాల్సి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.



పూరి ఎక్స్‌ప్రెస్‌లో డోరు దగ్గర కింద కూర్చున్న ప్రయాణికులు



రద్దీగా ఉన్న జనరల్ బోగీ



పూరి ఎక్స్‌ప్రెస్ ఆగినప్పుడు రద్దీగా ఉన్న ఒంగోలు రైల్వేస్టేషన్

తిరుపతి ప్రయాణికులే ఎక్కువ...

జిల్లాలోని అత్యధిక పట్టణాలు, గ్రామాలకు రైలు సౌకర్యం లేకపోవడంతో ముఖ్యమైన కేంద్రాలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులో ఒంగోలుకు వచ్చి రైలు ఎక్కాల్సి వస్తోంది. ముఖ్యంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతికి వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఇక్కడ నుంచి ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని కంభం, అర్ధవీడు, పొదిలి, చీమకుర్తి, సంతనూతలపాడు, కనిగిరి, కందుకూరు, అద్దంకి, దర్శికి చెందిన వారిలో ఎక్కువ మంది రైళ్లలో వెళ్లేందుకు మొగ్గు చూపుతారు.

ఇందుకుగాను ఆయా ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఒంగోలుకు చేరుకొని రైలులో తిరుపతికి వెళ్లి స్వామిని దర్శించుకొని వస్తుంటారు. దీంతో తిరుపతికి వెళ్లే రైళ్లు ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటాయి. రిజర్వేషన్ చేయించుకునే వాళ్లకు కూడా వెంటనే టికెట్లు లభించవు. రోజుల తరబడి నిరీక్షించాల్సి ఉంటుంది. మొదట్లో ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లు ఎక్కువగా ఉండేవి. కానీ ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. దానికి తోడు కరోనా సమయంలో పూర్తిగా రైళ్లను నిలిపివేసి తిరిగి పునఃప్రారంభించినప్పుడు ప్యాసింజర్లకు అనుమతి ఇవ్వలేదు. తిరుపతికి వెళ్లాలనుకునే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

ఉద్యోగుల రైళ్లు కిటకిట..

విజయవాడ నుంచి నెల్లూరు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు ఎప్పుడు చూసినా ఉద్యోగులతో కిటకిటలాడుతుంటుంది. ఈ రైలును ప్రత్యేకంగా ఉద్యోగుల కోసమే తిప్పుతున్నట్లు కనిపిస్తుంది. అందుకే ఈ రైలును గవర్నమెంటు రైలు అని పిలుస్తుంటారు. స్థానికంగా నివాసం ఉండాలన్న నిబంధనను కాలదన్ని అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం ఈ రైలుకు వచ్చి తిరిగి సాయంత్రం ఇదే రైలుకు తిరుగు ప్రయాణం అవుతుంటారు. ఒంగోలులో విధులు నిర్వహించే ఉద్యోగులు కొందరు ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి ప్రతి రోజు ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరుకు వెళ్లి హడావుడిగా ఆఫీసులో పనులు చూసుకొని తిరిగి సాయంత్రం 6 గంటలకల్లా వెళ్లిపోతుంటారు. దీంతో సామాన్య ప్రయాణికులకు ఇందులో చోటు దొరకడం గగనమై పోతుంది. ఎవరైనా ప్రయాణికులు పినాకిని ఎక్స్‌ప్రెస్ లో ప్రయాణం చేయాలంటే ఆదివారం, పండుగ సెలవుల సమయంలో అయితేనే సీటు దొరుకుతుంది. లేకపోతే నిలబడి ప్రయాణం తప్పదు.

జనరల్ బోగీలు పెంచాలి



నేను బాపట్ల వెళ్లడానికి సింగరాయకొండలో రైలు ఎక్కాను. కానీ రైలులో కూర్చోవటానికి అవకాశం లేదు. దీంతో నించొని ప్రయాణించాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వం మధ్య తరగతి ప్రయాణికుల గురించి పట్టించుకోవటం లేదు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల జనరల్ బోగీలు పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

– పోకూరి ఆంజనేయులు, బాపట్ల

సమన్వయంతో మాదకద్రవ్యాల నివారణ

- విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో మాదక ద్రవ్యాలు అందుబాటులో లేకుండా చూడాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా, బాలల హక్కు పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బాలలు మాదకద్రవ్యాలు వినియోగించకుండా నివారించడంలో, వాటిని అందుబాటులో లేకుండా చేయడంలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. బాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం, వారి అక్రమ రవాణా కట్టడికి సంయుక్త కార్యాచరణ ప్రణాళికల అమలుపై మంగళవారం బాలల కమిషన్ సభ్యురాలు అధ్యక్షతన కలెక్టర్ సమక్షంలో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో పద్మావతి మాట్లాడుతూ విద్యా సంస్థలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఏ రూపంలోనూ మాదక ద్రవ్యాలు బాలలకు అందుబాటులో లేకుండా చూడాలన్నారు. వీటికి అలవాటు పడిన వారిని వాటి నుంచి విముక్తి కలిగించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యా సంస్థలు, హాస్టళ్లు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలన్నారు. జువైనల్ జస్టిస్ చట్టంపై కూడా అవగాహన కల్పించాలన్నారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ బయట ఉంటున్న పిల్లలతో పాటు విద్యా సంస్థల్లో ఉంటున్న వారు కూడా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న సంఘటనలు ఆందోళన చెందాల్సిన విషయం అన్నారు. వార్డెన్‌లు హాస్టళ్లలో పిల్లలను నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలతో చిన్న పిల్లలు ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోతారని, వీటిపై ప్రణాళికాబద్ధమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, డీసీపీవో దినేష్‌కుమార్, ఏఎస్పీ శ్రీధర్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, దివ్యాగుల సంక్షేమ అధికారి అర్చన, మైనార్టీ సంక్షేమ అధికారి నారాయణ, డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, డీఈఓ సుభద్ర, డ్రగ్స్ నివారణ శాఖ ఏడీ జ్యోతి, కార్మిక శాఖ ఏడీ అనిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి



నైపుణ్య కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్‌ప్లాన్ రూపొందించాలన్నారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణ అందించడం, అనంతరం ఉపాధి చూపేందుకు జాబ్‌మేళాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, సెట్నల్ సీఈఓ లోకేశ్వరరావు, మెప్మా పీడీ రవికుమార్, ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్, టూరిజం అధికారి బెన్హర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, రూడ్‌సెట్, సీడాట్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దర్శి దేశంలో ఇసుక చిచ్చు..

- వాగులు, వంకలు ఖాళీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్
- తమకి కాదని తన అనుచరులకు కట్టబెట్టడంపై స్థానిక నేతల గుర్రు
- ఇసుకలో స్థానిక నేతల జోక్యం వద్దని హుకుం
- ఇన్‌చార్జ్ తీరుపై నేతల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి ఒంగోలు: దర్శి టీడీపీలో ఇసుక చిచ్చు రేగుతోంది. అధికారంలోకి వచ్చాక ఇసుక ఫ్రీగా ఇస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకే మాటతప్పారు. పార్టీ అధినేత తీరు ఇలా ఉంటే జిల్లాలో పార్టీ నేతల తీరు అంతకంటే దారుణంగా ఉంది. దర్శి నియోజకవర్గంలో అయితే పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మరో అడుగు ముందుకేసి తన అనుచరవర్గంతో ఇసుక దందాకు తెరతీశారు. పోలవరంలో వాగులు, వంకల్లో ఇసుకను టిప్పర్ల ద్వారా ఊడ్చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇంతవరకూ పార్టీ కోసం కష్టపడిన తమని కాదని తన అనుచరులకు కట్టబెడుతున్నారంటూ టీడీపీ నేతలు రగిలిపోతున్నారు. స్థానిక నాయకులెవరూ ఇసుక వైపు కన్నెత్తి చూడకూడదంటూ ఆమె హుకుం జారీ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకకు అడ్డొస్తారనే కేసులో ఇరికించి..

పార్టీకి ముఖ్యనాయకుడు, లోకేష్‌కు అత్యంత సన్నిహితుడు. ఎన్నికల ముందు జరిగిన లోకేష్ ప్రజాగళం యాత్రకు సైతం భారీగా ఖర్చు పెట్టాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మండలంలో తనకు అడ్డు ఉండదనుకున్న అతనికి ఆదిలోనే ఇక్కట్లు ఎదురయ్యాయి. టీడీపీ ఇన్‌చార్జి కన్ను పోలవరం ఇసుక రీచ్‌పై పడిందని, తనకు సదరు నాయకుడు ఎక్కడ అడ్డుగా వస్తాడోనని కుట్రలకు తెరతీశారని, కావాలనే శంకరాపురంలో గొడవలు సృష్టించి అతనిపై నాన్‌బెయిల్ కేసులు పెట్టించారని టీడీపీ నేతలే బహిరంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇసుక విషయంలో స్థానిక నేతలు ఎవరు నోరెత్తినా సదరు నాయకునికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరికలు జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలవరంలో ఎవరైనా భూములు విక్రయించాలనుకుంటే తమకే ఇవ్వాలని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఇసుక పాలసీకి ఏమాత్రం తగ్గకుండా ఇసుక ధర రూ.15 వేలు టిప్పర్‌కు తీసుకుంటున్నారు. క్వారీలో టిప్పర్‌కు ఇసుక ఎత్తాలంటే రూ.10 వేలు కట్టాల్సిందే. మిగిలిన రూ.5 వేలు దూరాన్ని బట్టి రవాణా చార్జీల కింద తీసుకుంటున్నారు. ఇంతకాలం పార్టీ కోసం కష్టపడిన తమను కాదని స్థానికేతరులైన ఆమె అనుచరులకు ఎలా కట్టబెడతారంటూ పార్టీ కేడర్ రగిలిపోతోంది. ఇదిలా ఉండగా ఇసుక దోపిడీపై ప్రతి రోజు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా తమకేమీ తెలియనట్లు మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ ముందు నుంచే ప్రతి రోజు ఇసుక టిప్పర్లు తిరుగుతున్నా ఆ వైపు కన్నెత్తి చూసే ధైర్యం కూడా పోలీసులు చేయడం లేదు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కేడర్ ఆమె వ్యవహారశైలిపై రగిలిపోతున్నారు. ఆరంభంలోనే ఇలా ఉంటే ఐదేళ్లు ఎలా అంటూ అంతర్గతంగా రగిలిపోతున్నారని సమాచారం.

పౌర సరఫరాల నిఘా వ్యవస్థ మెరుగుపడాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: పౌర సరఫరాల వ్యవస్థ, నిఘా వ్యవస్థ మరింత మెరుగుపడాలని, అందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సూచించారు. మంగళవారం మీకోసం భవనంలో పౌరసరఫరాల వ్యవస్థ మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఓపెన్ హౌస్ మేధోమథనం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ పౌర సరఫరాల వ్యవస్థ పనితీరుతో పాటు ధాన్యం, కందుల సేకరణ, మండల స్థాయి స్టాక్ పాయింట్స్, తదితర అంశాలపై వివరించి అభిప్రాయ సేకరణ చేశారు. పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని వ్యవస్థలో మంచి మార్పులు చేసి మెరుగైన సేవలు ప్రజలకు అందించడమే లక్ష్యం అన్నారు. దీనిలో డీఎస్‌ఓ ఉదయ్‌భాస్కర్, మార్కాపురం సబ్ కలెక్టర్‌తో పాటు ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు, విజిలెన్స్, సివిల్ సప్లయిస్ డీటీలు, డీఈఓ, ఇతర అధికారులు, రేషన్ డీలర్ల సంఘం నాయకులు, రైస్, డాల్ మిల్లర్ల సంఘాల నాయకులు, ఎండీయూ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పౌర సరఫరాల శాఖపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

క్లుప్తంగా

రూ.8 లక్షల మోసంపై కేసు నమోదు

మార్కాపురం: కూల్ డ్రింక్స్ విక్రయించగా వచ్చిన సొమ్మును కాజేసిన సేల్స్ మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వివరాలు.. మార్కాపురం పట్టణానికి చెందిన జి.సుప్రియ కూల్ డ్రింక్స్ హోల్ సేల్ వ్యాపారం చేస్తున్నారు. ఆమె వద్ద సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న డి.ప్రసాద్ కూల్ డ్రింక్‌లను వివిధ దుకాణాలకు విక్రయించగా వచ్చిన నగదు రూ.8 లక్షలు కాజేశాడు. బాధితురాలు సుప్రియ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పొగాకు గరిష్ట ధర రూ.360

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో వేలంలో పొగాకు మంగళవారం గరిష్ట ధర రూ.360 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 9629 బేళ్లు రాగా 8558 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 1071 బేళ్లను తిరస్కరించారు. ఒంగోలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 118వ రోజు వేలంపాటలో 4911 బేళ్లు రాగా 4406 బేళ్లను కొనుగోలు చేసి 505 బేళ్లను తిరస్కరించారు. అందులో గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.299.84 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 112వ రోజు వేలం పాటలో 4718 బేళ్లు రాగా 4152 బేళ్లు కొనుగోలయ్యాయి. 566 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.306.46గా నమోదైంది.

ఇంటి ముందు నడిచిందని మహిళపై దాడి


తీవ్రంగా గాయపడిన కళావతి

అర్ధవీడు(బేస్తవారిపేట): తమ ఇంటి ముందు సీసీ రోడ్డుపై నడిచిందన్న కారణంతో ఓ మహిళను మాజీ సర్పంచ్, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన అర్ధవీడు మండలంలోని చింతమెల్లెలపాడు ఎస్సీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సీ కాలనీలో ఉండే మాజీ సర్పంచ్ కువ్వారపు అంకయ్య గత మే నెల నుంచి కాలనీలోని రోడ్డుపై ఏసెపోగు పెద్ద కాశయ్య, కళావతి కుటుంబ సభ్యులను తిరగనివ్వడం లేదు. కాలనీ చివరిలో ఉన్న పెద్దకాశయ్య కుటుంబం అంకయ్య ఇంటి ముందు నుంచి వెళ్లాల్సి ఉంది. ఇంటి ముందు రోడ్డుపై నడిస్తే గొడవపెట్టుకుని దాడి చేస్తున్నారు. వీరి దౌర్జన్యాన్ని భరించలేక కాలనీ పక్కన ఉన్న పొలాల్లోంచి కాశయ్య కుటుంబం రాకపోకలు సాగిస్తోంది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, పెద్ద మనుషులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో కళావతి మంగళవారం సీసీ రోడ్డుపై నడిచి వెళ్తుండగా అంకయ్య, కుటుంబ సభ్యులు దాడిచేశారు. కళావతి తీవ్రగాయాలతో పడిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రురాలిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శ్రీశైలం డ్యామ్‌కు పర్యాటకుల క్యూ


శ్రీశైలం డ్యామ్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మార్కాపురం: శ్రీశైలం డ్యామ్ 5 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేయడంతో కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు పశ్చిమ ప్రకాశం నుంచి పర్యాటకులు క్యూ కడుతున్నారు. కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టి, జూరాల, నారాయణపూర్ డ్యామ్‌లకు వరద నీరు పోటెత్తడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలానికి భారీగా నీరు చేరుతుండటంతో సోమవారం 3 గేట్లు, మంగళవారం ఉదయం మరో రెండు గేట్లు, రాత్రికి మరో ఐదు గేట్లు ఎత్తి సాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి బస్సులు, కార్లు, జీపుల్లో వెళ్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి శ్రీశైలం వెళ్లే బస్సులు రద్దీగా ఉన్నాయి.

ఇంతటి సంబరానికి..
అంతటి డప్పు!

- ధరలు దించుతామని బీరాలు పలికిన టీడీపీ కూటమి సర్కారు పెద్దలు
- నాణ్యమైన కందిపప్పు, బియ్యం తక్కువ ధరకే అంటూ జోరుగా ప్రచారం
- మార్కెట్ ధరకు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రేటుకు వ్యత్యాసం నామమాత్రం
- నాణ్యంగా లేకపోవడంతో కందిపప్పు, బియ్యం కొనేందుకు ప్రజల విముఖత
- కొన్ని మండలాలకు నేటికీ అందని కందిపప్పు, బియ్యం
- కేంద్రాల నిర్వహణే ప్రహసనమని అధికారులు, మిల్లర్ల విసుర్లు


సింగరాయకొండలో బియ్యం, కందిపప్పు విక్రయానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్

ఒంగోలు అర్బన్: ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కంది పప్పు, బియ్యం అందజేస్తామని ఊదరగొట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే చేతులెత్తేసింది. ఓ వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కంది పప్పు ధర డబుల్ సెంచరీ దాటింది. ఈ తరుణంలో ధరలు దించుతామంటూ బీరాలు పలికిన ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక కేంద్రాలు, రైతు బజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్కువ ధరకే కంది పప్పు, బియ్యం ఇస్తామంటే ఆశపడిన పేద, మధ్య తరగతి ప్రజలు.. వాటి నాణ్యత, ధరలు చూసి పెదవి విరుస్తున్నారు. ఇంతటి సంబరానికి అంతటి డప్పెందుకని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మాటలకే పరిమితమైన నాణ్యత

మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కంది పప్పు, బియ్యం అందించే ప్రత్యేక కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించి ఉపన్యాసాలు దంచారు. కానీ ఆ కేంద్రాలతో ప్రజలకు ఒనగూరిందేమీ లేదన్న అభిప్రాయం జిల్లా అంతటా వినిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధరలు బయట మార్కెట్‌లో ధరలకు పెద్ద వ్యత్యాసం లేకపోవడం గమనార్హం. కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్ బియ్యం కేజీ రూ.49, బీపీటీ పచ్చి బియ్యం రూ.48 లెక్కన ప్రత్యేక కేంద్రాల్లో అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే బయట మార్కెట్‌లో కందిపప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.250కు లభిస్తున్నాయి. అదేవిధంగా బియ్యం కూడా రకాలను బట్టి రూ.50 నుంచి లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం నాణ్యత లేకపోవడంతోపాటు ధరలో వ్యత్యాసం నామమాత్రంగా ఉండటంతో ప్రజలు వాటి వైపు వెళ్లడమే మానేశారు.

కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

జిల్లాలో పలు మండలాల్లో ప్రత్యేక కేంద్రాలకు పప్పు, బియ్యం సరఫరా కాలేదు. కొన్ని మండలాలకు రెండోరకం బియ్యం, కందిపప్పు చేరనే లేదు. జిల్లా కేంద్రం ఒంగోలులో తప్ప మిగిలిన అన్ని మండలాల్లో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అయితే మండలాలకు సరుకులు పంపేందుకు రవాణా చార్జీల చెల్లింపుల్లో స్పష్టత లేక సరుకుల పంపిణీ ఆగినట్లు సమాచారం. కొండపి నియోజకవర్గంలో మర్రిపూడి, టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి మండలాలకు ఇంతవరకు కందిపప్పు అసలు సరఫరానే కాలేదు. అదేవిధంగా మర్రిపూడి మండలంలో బియ్యం చేరలేదు. ఈనెల 18వ తేదీ కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ సింగరాయకొండ మండలంలో కందిపప్పు కేవలం 10 కేజీలు, కొండలో సుమారు 50 కేజీల కందిపప్పు మాత్రమే అమ్ముడయ్యాయి. మండలాల్లో ఈ కేంద్రాలను రెవెన్యూ అధికారులు నిర్వహిస్తుండగా, కొన్ని కేంద్రాల బాధ్యతలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు అప్పగించడంతో నిర్వహణ, గుమస్తా ఖర్చులు భరించడం తలనొప్పిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో సరుకులేవీ?

రేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కంది పప్పు, చక్కెర, గోధుమ పిండి తదితర సరుకుల పంపిణీకి ఎగనామం పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దుకాణాల్లో రూ.80కే లభించాల్సిన కేజీ కందిపప్పును ప్రత్యేక కేంద్రాల పేరుతో రూ.160కు విక్రయించడమేమిటన్న ప్రజల ప్రశ్నకు సమాధానం ఇచ్చే వారే లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సరుకులు సజావుగా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అంధులంటే అంత చిన్నచూపా?

- పుస్తకాలు ఇవ్వాలని అడిగితే అసభ్యంగా దూషిస్తారా..
- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలి
- నిరసన ప్రదర్శనలో ఏఐఎస్ఎఫ్ నాయకులు


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, అంధ విద్యార్థులు

ఒంగోలు టౌన్: విద్యా సంవత్సరం మొదలై రోజులు గడుస్తోందని, పుస్తకాలు ఇవ్వాలని కోరిన అంధ విద్యార్థులను విభిన్న ప్రతిభావంతుల సంస్థ మేనేజింగ్ డైరక్టర్ కుమార్ రాజా అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్ ఆరోపించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో అంధ విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రంలో 10 వేలకు పైగా అంధ విద్యార్థులు ఉన్నారని, నేటికీ పాఠ్య పుస్తకాలు అందలేదని తెలిపారు. అసలు బ్రెయిలీ ప్రెస్‌లో పుస్తకాలు ముద్రించారో లేదో అంతుబట్టడం లేదన్నారు. ప్రెస్‌లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.26 లక్షలు కేటాయిస్తే అందులో కూడా అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రెస్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న హారిక కూడా అంధ విద్యార్థులను దూషిస్తున్నారని విజువల్ చాలెంజ్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్కెపోగు రత్నరాజు విమర్శించారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. నిరసనలో అంధ విద్యార్థులు నాగూర్ బాషా, ఇంటూరి అశోక్ బాబు, కిశోర్, ప్రసన్న కుమార్, ఏసుదాసు, అనిల్, శివశంకర్, బాలస్వామి పాల్గొన్నారు.

ట్రక్ ఢీకొని యాచకుడు మృతి


ప్రమాదంలో మృతి చెందిన యాచకుడు

బేస్తవారిపేట: ట్రక్ ఢీకొట్టడంతో యాచకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బేస్తవారిపేట సమీపంలో ఆర్‌కే నగర్ జంక్షన్‌లో ఒంగోలు–నంద్యాల హైవేపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. జంక్షన్ సమీపంలో ఇద్దరు యాచకులు భోజనం చేసి రోడ్డుకు ఒక వైపున కూర్చున్నారు. వీరిలో ఒకరు బీడీలు కొనుగోలు చేసేందుకు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కడప నుంచి ఖమ్మంకు పచ్చిమిర్చి లోడుతో వెళ్తున్న ట్రక్ ఢీకొట్టింది. యాచకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు పూర్తిగా తెలియవని, చీరాల వద్ద ఈపురుపాలెం అని మాత్రమే తెలుసని సహచర యాచకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నకిలీ పట్టాలిచ్చారని ఫిర్యాదు

మార్కాపురంటౌన్: పట్టణానికి చెందిన ఆర్ గురవయ్య తన దగ్గర వివిధ సందర్భాల్లో రూ.25 లక్షలు తీసుకొని నకిలీ పట్టాలు ఇచ్చి మోసం చేశాడని పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన ఆర్ సరిత అనే మహిళ మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురవయ్య తొలుత కంభంలో ఒక స్థలం కొనుగోలు చేసినట్లుగా తన పేరుపై అగ్రిమెంట్ రాసిచ్చి డబ్బులు తీసుకున్నాడని ఆ తరువాత ఆ స్థలం హైవేరోడ్డులో పోయిందని చెప్పి మార్కాపురం పట్టణంలోని సాయిబాబా గుడివద్ద మరొక స్థలాన్ని అగ్రిమెంట్ రాసిచ్చారన్నారు. ఆ స్థలం కూడా వేరేవారి పేరుపై ఉందని చెప్పి కొండేపల్లి వెళ్లే రహదారిలో ఒక పట్టా ఇచ్చాడని ఆమె తెలిపారు. ఈ పట్టాపై తనకు అనుమానం వచ్చి రెవెన్యూ కార్యాలయంలో విచారించగా నకిలీగా తేలిందని, దీంతో తాను మోసపోయానని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

105 విద్యుత్ స్తంభాలు మాయం

యర్రగొండపాలెం: మండలంలోని అమానిగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉంచిన 105 విద్యుత్ స్తంభాలు మాయమైనట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం గుర్తించారు. ఇటీవల ఆ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. తొలగించిన స్తంభాలను అక్కడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉంచారు. యర్రగొండపాలెంలోని 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆ శాఖ కన్‌స్ట్రక్షన్ అధికారులు మరమ్మతుల చేయిస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలతో అవసరం వచ్చింది. దీంతో వారు అమానిగుడిపాడు సబ్‌స్టేషన్‌లోఉన్న విద్యుత్ స్తంభాల కోసం అక్కడికి వెళ్లారు. అయితే అక్కడ స్తంభాలు కనిపించకపోవడంతో ఏఈ అల్లూరయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అమానిగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కొంతమంది రైతులకు అమ్ముకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆగిన గుండెకు సీపీఆర్‌తో పునర్జన్మ

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్:


సీపీఆర్ ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎస్పీ దామోదర్

దురదృష్టవశాత్తు ఎవరైనా గుండెపోటుతో కుప్పకూలిపోతే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. నగరంలోని ఒన్‌టౌన్, టూటౌన్, తాలుకా, ట్రాఫిక్, సీసీఎస్, ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమయ్యే పోలీసులు సీపీఆర్ చేయడంలో శిక్షణ పొందాలని సూచించారు. ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువైన నేపథ్యంలో సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని చెప్పారు. సీపీఆర్‌తో గుండెకు రక్త ప్రసరణ అయ్యేలా చేసి, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె తిరిగి పని చేయడం ప్రారంభిస్తుందన్నారు. యాక్సిడెంట్లలో, నీటిలో మునిగి గుండె ఆగిన వారికి తక్షణమే సీపీఆర్ చేసే విధానాన్ని, గుండె పోటు లక్షణాలను జిల్లా పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ భానుమతి, పీటీసీ డాక్టర్ మానస, ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యుడు సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టుకతో లోపాలకు ప్రత్యేక చికిత్సలు

- ఒంగోలు, మార్కాపురం జీజీహెచ్‌లలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమాలు
- 18 ఏళ్ల పిల్లల్లో 30 రకాల సమస్యల గుర్తింపు
- 14 మంది శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో చికిత్సలు


పుట్టుకతో లోపాలున్న చిన్నపిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: జాతీయ హెల్త్ మిషన్ రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు ఒంగోలు, మార్కాపురం జీజీహెచ్‌లలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథీ దేవి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 18 ఏళ్ల లోపు బాలబాలికలను పరీక్షించిన వైద్యుల బృందం చిన్నారులలోని నాలుగు ప్రధాన లోపాలను గుర్తించారు. బరువు తక్కువ, రక్తహీనత, పోషకాహార లోపాలు, ఆలస్యంగా జ్ఞానాభివృద్ధి, మాటలు సరిగా రాకపోవడం, వినికిడి సమస్యలకు ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు వైద్య సేవలను అందించారు. గ్రహణమొర్రి, వంకరపాదాలు, చెవిటి, మూగ, గుండెకు సంబంధించిన లోపాలను గుర్తించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో చిన్నపిల్లల్లో లోపాలను గుర్తించి వైద్యం చేయించాలని డాక్టర్ భగీరథి సూచించారు. డీఈఐసీ సెంటర్ల ద్వారా శాశ్వత అంగవైకల్యాన్ని కూడా నివారించవచ్చన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో చిన్నపిల్లల వైద్యులు, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, ఆడియాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డీఈఓ తదితర సిబ్బంది వైద్య సేవలను అందించనున్నారని తెలిపారు.

కుటుంబ వివాదం.. వీధి పోరాటం

- సింగరాయకొండలో మామ, కోడలి మధ్య ఘర్షణ
- పోలీసుల తీరును నిరసిస్తూ కోడలి వర్గం ధర్నా
- ఇరువర్గాలపై కేసులు నమోదు


ధర్నాకు దిగిన వారితో మాట్లాడుతున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: కుటుంబ తగాదా నేపథ్యంలో మామ, కోడలు మధ్య చోటుచేసుకున్న ఘర్షణ విషయమై ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు సింగరకాయకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక వెంకటేశ్వరకాలనీకి చెందిన తుమ్మ సుకన్య, ఆమె మామ మాలకొండయ్య మధ్య కుటుంబ విషయమై సోమవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. సుకన్య ముఖంపై గాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మంగళవారం ఉదయం విచారిస్తామని సుకన్యకు సర్దిచెప్పి పంపారు. అయితే మంగళవారం ఉదయం సుకన్య, ఆమె ఆడపడుచు పాలేటి పద్మ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పద్మ భర్త మురళి డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో సుకన్య అన్న కసుకుర్తి పవన్‌కళ్యాణ్ తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ పద్మ భర్త మురళిపై చేయిచేసుకున్నాడు. దీంతో పోలీసులు పవన్‌కళ్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సుకన్య తరఫు వారు పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఎస్సై టి.శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకుని సుకన్య వర్గీయులను శాంతపరిచారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ధర్నాకు దిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన మరి కొందరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మద్దిపాడు: ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వెంకట్రాజుపాలెం జాతీయరహదారిపై మంగళవారం సాయంత్రం 5 గంటలకు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొరిశపాడు మండలం దైవాలరావూరుకు చెందిన కొప్పోలు అంజయ్య (55) అనే వ్యక్తి బైక్‌పై ఒంగోలు నుంచి మేదరమెట్ల వైపు వెళుతూ ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి మృతుని బంధువులకు సమాచారం అందించారు. మద్దిపాడు ఏఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆరోగ్య భవిష్యత్ మహిళల చేతుల్లోనే..


మాట్లాడుతున్న న్యాయమూర్తి భారతి

కొత్తపట్నం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం అల్లూరులోని తిమ్మరాజు యానాది కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, తన కాళ్లమీద తాను నిలబడాలని సూచించారు. అప్పుడే చైతన్యవంతమైన సమాజంలో భాగస్వాములు కావచ్చన్నారు. అదేవిధంగా ప్రతి మహిళ మంచి అలవాట్లతో ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. డీఎంహెచ్ఓ సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ వైష్ణవి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల మహిళల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో హోంమంత్రి అనిత


హోం మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని కట్టడి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని, నేరాలను అరికట్టేందుకు పకడ్బందీగా వ్యవహరించాలని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు, పోక్సో కేసులు, సైబర్ నేరాలపై సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసులను ఛేదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, సిబ్బంది కొరత గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్రరావు, డీసీఆర్బీ సీఐ భీమానాయక్ పాల్గొన్నారు.


రైలు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం


రైలు కింద పడి మరణించిన వ్యక్తి

ఒంగోలు టౌన్: వేగంగా వెళుతున్న రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..ఒంగోలు–సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని ఒక ప్రయాణికుడు రైలు నుంచి జారి పడి మరణించాడు. మృతునికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని జీఆర్పీ పోలీసులు భావిస్తున్నారు. ఎరుపురంగు చొక్కా, బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిస్తే 9440904870 నంబర్‌ను సంప్రదించాలని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

రెండు నిముషాల్లో ఇంటికి వస్తాడనుకుంటే..

- నీళ్ల ట్యాంకర్ కింద పడి వ్యక్తి మృతి


ట్యాంకర్ కిందపడి మృతి చెందిన చెన్నయ్య

యర్రగొండపాలెం: మండలంలోని కొలుకులకు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. చిన్న కొలుకుల గ్రామానికి చెందిన జి.చిన్నచెన్నయ్య(35), అతని మిత్రుడు కలిసి మోటారు బైక్‌పై నల్లమల అడవుల్లోని దద్దనాల ఆంజనేయ స్వామిని దర్శించుకొని తిరిగి గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో నీళ్ల ట్యాంకర్ కొలుకులకు వెళ్తున్న సమయంలో మోటారు బైక్ అదుపుతప్పి కిందపడింది. చెన్నయ్య ట్యాంకర్ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మిత్రుడు రోడ్డుకు అవతలి వైపు పడటంతో ఆయన ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రెండు నిమిషాల్లో చెన్నయ్య తన ఇంటికి చేరాల్సిన సమయంలో ఈ సంఘటన జరగడంతో మృతుడి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే తాటిపర్తి విస్తృత పర్యటన

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లిలో జరిగే ఒక శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లిలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన కార్యకర్తను పరామర్శించి చెక్కు అందచేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పుల్లలచెరువు మండలం బీరినేనిపల్లెలో జరిగే ఒక శుభ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు త్రిపురాంతకం మండలం రాజుపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహా పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ

పొదిలి: శ్రీరంగం నుంచి అయోధ్య వరకు అక్టోబర్ 12 వ తేదీ నుంచి మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు గోవిందనామ ప్రచార సేవా సంఘం సభ్యులు మేడా నరసింహారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఆలయ అర్చకులు మురళీకృష్ణమాచార్యుల చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. నరసింహారావు మాట్లాడుతూ.. కరపత్రాల్లో ఒక వైపు ఉన్న ఖాళీ గడులను గోవింద నామాలతో నింపాలని భక్తులకు సూచించారు. చిరునామా, ఫోన్ నంబర్ రాసి ఆలయ కమిటీ సభ్యులకు అందజేయాలని కోరారు. లోకకళ్యాణార్థం, రైతు సంక్షేమం కోసం 120 రోజులపాటు 2500 కి.మీ మేర నిర్వహించే ఈ మహాపాదయాత్రలో పాల్గొనే భక్తులు తమ వివరాలను సభ్యులకు తెలియజేయాలని చెప్పారు.

విత్తనాల దుకాణాలు తనిఖీ

కంభం: దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి డి.స్వరూప హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను మంగళవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన ఫారం సి, నిల్వల రిజిస్టరు తనిఖీ చేసి నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. విత్తనాలు విక్రయాలు చేసే సమయంలో రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పక్వానికి వచ్చిన పైరుకు సరిపడా నీరు అందించాలి


రైతులకు సలహాలు ఇస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): సాగు చేసిన పంట పక్వానికి వచ్చిన దశలో పైరుకు సరిపడా నీరు అందించాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, తాళ్లూరు గ్రామాల్లో మంగళవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నందున పైరు బెట్టకు వస్తుందన్నారు. దీనికి తోడు విపరీతమైన ఎత్తుగాలులు వీస్తున్నందున పైరుకు అవసరమైనపుడల్లా నీటిని తగు మోతాదులో అందించాలన్నారు. తేమ శాతం తగ్గితే పైరు దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా పశుగ్రాస విత్తనాలు


రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి విజయలక్ష్మి

ముండ్లమూరు: మండలంలోని పాడి రైతులకు ఉచితంగా పశుగ్రాసం విత్తనాలు అందజేయనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రం ముండ్లమూరులో మంగళవారం పాడి రైతులకు ఉచితంగా పశుగ్రాసం విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత గల ప్రతి రైతుకు మూడు కేజీల చొప్పున ఉచితంగా గడ్డి విత్తనాలు అందిస్తామన్నారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబరుతో పశువైద్యశాలను సంప్రదించి పొందొచ్చన్నారు. సిబ్బంది అనూష, కుసుమ, వెంకటేశ్వర్లు, శంకర్, యోహాను, రైతులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై వాలిన పచ్చ గద్దలు

- బలవంతపు రాజీనామాలు చేయించడంలో అధికారులు సక్సెస్
- రేషన్ బియ్యం దోపిడీకి తెరలేపిన టీడీపీ నాయకులు


వై.పాలెంలోని పౌరసరఫరాల గోడౌన్

యర్రగొండపాలెం:

రేషన్ షాపులపై పచ్చ గద్దలు వాలాయి. డీలర్ల ముసుగులో రేషన్ బియ్యం మెక్కేయటానికి ఆ గద్దలు సిద్ధమయ్యాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి టీడీపీ వర్గీయులు నియోజకవర్గంలోని రేషన్ షాపులను నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఉన్న రేషన్ షాపు డీలర్లను తొలగించి నియోజకవర్గ టీడీపీ నాయకుడి వద్ద మెప్పు పొందడంలో రెవెన్యూ అధికారులు సఫలం అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకులు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసుకునేందుకు వారు మండలానికి ఒక కూటమిగా ఏర్పడ్డారు. రేషన్ షాపులకు చేరిన బియ్యం నేరుగా ఆ పార్టీకి చెందిన నాయకుడి ఆదేశాల మేరకు సరఫరా చేయాల్సి ఉంది. ఆ నిబంధనతోనే కొత్తగా డీలర్ల నియామకం జరిగిందని ఆరోపణలు వినవస్తున్నాయి. గత నెలలో త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లో అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్నారు. వచ్చే నెలలో అటువంటి పరిస్థితి లేకుండా సజావుగా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసుకునేందుకు అధికారులు పచ్చజెండా ఊపారు. నేరుగా సివిల్ సప్లయి గోడౌన్ నుంచే బియ్యం రవాణా చేసుకునేందుకు పచ్చ నాయకులు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో మొత్తం 173 రేషన్ షాపు డీలర్లు ఉండగా వారిలో 37 మంది పర్మినెంట్ డీలర్లు ఉన్నారు. మిగిలిన 136 మంది తాత్కాలిక డీలర్ల నుంచి బలవంతంగా రాజీనామాలు చేయించి వారిని తొలగించారు. వచ్చే నెల నుంచి రేషన్ పంపిణీ చేసేందుకు టీడీపీ వర్గీయులకు చెందిన వారిని నియమించారు. పర్మినెంట్ డీలర్లు రాజీనామాలు చేయక పోవడంతో వారిని ఏదో ఒక విధంగా వేధింపులకు గురిచేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 84,403 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి 11,96,219 కిలోల బియ్యం, 84,403 కిలోల కందిపప్పు, 42,202 కిలోల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. అందులో బియ్యం మాత్రమే పంపిణీ చేసేందుకు రేషన్ షాపులకు నిల్వలు సిద్ధం చేశారు. ఈ సారికూడా పంచదార, కంది పప్పు పేదలకు పంపిణీ చేయకుండా కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టనుంది.

చట్టాన్ని అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం


విత్తనాల ప్యాకెట్‌ను తనిఖీ చేస్తున్న నీరజ

దొనకొండ: పురుగు మందులు, విత్తనాలు విక్రయించే దుకాణ యజమానులు చట్టాన్ని అతిక్రమిస్తే వెంటనే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా అంతర్గత తనిఖీ అధికారి, యర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.నీరజ హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం దొనకొండలోని నాలుగు దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని పురుగుమందులు, విత్తనాలను అమ్మరాదని, రైతు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్‌కు రైతులు అడిగినా అడగక పోయినా తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ముందుగా ఆమె స్టాక్ రిజిస్టర్‌ను, బిల్ పుస్తకాలను, కంపెనీ అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లోని విత్తన ప్యాకెట్లకు స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలను సరి చూశారు. కల్తీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే అటువంటి వారిపై డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లో రాత్రి వేళల్లో అమ్మే వారి దగ్గర కొనకూడదని తెలిపారు. రైతులు ఈ విషయాలను గమనించి తమకు ఇబ్బందులు చేసిన డీలర్లను తెలియజేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, సిబ్బంది విన్నీబాబు, రవితేజ పాల్గొన్నారు.

పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలి

పుల్లలచెరువు: పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలని ఎంపీడీవో విలియమ్స్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో మొత్తం 7856 పింఛన్లు ఉన్నాయని, వాటిని సచివాలయ సిబ్బంది ద్వారా మొదటి రోజే 100 శాతం పింపిణీ చేయాలని ఆదేశించారు. తప్పని సరిగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ఉదయం 5.30 గంటల నుంచే పంపిణీ ప్రారంభించాలని, ఈ పింఛన్ల పంపిణీకి సంబంధించి సిబ్బంది ఎటువంటి అశ్రద్ధ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


కంప్యూటర్ గురించి వివరిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంఈవో ఇందిర ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన పిఎంశ్రీ పాఠశాలలకు మౌలిక వసుతులతో పాటు సాంకేతికతను తెలియజేసే కంప్యూటర్లును అందజేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో ఎంఈవో వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ విద్య ఆవశ్యకతను తెలియచేశారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థి చదువుతో పాటు సాంకేతికతను కూడా అందిపుచ్చుకోవాలని, ఇంటర్నెట్ వినియోగంతో విద్యార్థి తన సందేహాలను నివృతి చేసుకుంటూ అభివృద్ధి దిశలో పయనించాలని కోరారు. నిత్య జీవితంలో మొబైల్, ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన పెంచుకుంటే రకరకాల విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని, అన్ని రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ సాంకేతికతను ఉపయోగించుకుంటూ ఉపాధ్యాయులు చెప్పే విషయాలను గ్రహించి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. ఈ స్కీంలో భాగంగా పాఠశాలల్లో ల్యాబ్‌లు, అధునాతన తరగతి గదులు, క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పించనున్నారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో పాటు అన్నీ మావే!


పెద్దారవీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం

పెద్దారవీడు: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మండల పరిధిలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు, రేషన్ షాపులు మార్చాలంటూ తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. ఇప్పటికే గ్రామాల్లో రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న ఏజెన్సీలు నాకంటే నాకు అని ఆశావహులు ముందుకొస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మండలంలో 19 పంచాయతీల్లో చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ షాపులు, మధ్యాహ్న ఏజెన్సీలను తొలగించి టీడీపీ సానుభూతిపరులకు అవకాశం కల్పించాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రేషన్ డీలర్లచే రాజీనామాలు చేయించి రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకులకు డీలర్ షాపులు ఇచ్చారు. టీడీపీ సానుభూతిపరులు ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు, మధ్యాహ్న ఏజెన్సీల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకొస్తున్నారు. దీంతో గ్రామాల్లో వీటిపై పోటీ తీవ్రంగా ఉండటంతో ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ మండల, గ్రామ స్థాయి నాయకులకు తలనొప్పిగా మారిందని చర్చ సాగుతోంది. రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులపై టీడీపీ నాయకుల కంటే తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు ఏది చెప్పినా కాదనకుండా చకచకా సంతకాలు పెట్టడంతో పాటు భజనపరులుగా మారిన మండల స్థాయి అధికారులు అండగా ఉంటున్నారు. గ్రామాల్లో రేషన్ షాపు డీలర్లు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ప్రజల నుంచి ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేవు. ఈ ప్రభుత్వం మాది.. ఇక్కడ మావాళ్లే పని చేస్తారు.. రాజీనామాలు చేయాలని దౌర్జాన్యాలకు తెరదీశారు. మండల పరిధిలో 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్లచే రాజీనామాలు చేయించాలని, వారికి రావాలసిన జీతాలు కూడా ఇచ్చేది లేదని చెప్పాలని టీఏలను ఎంపీడీఓ ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఇప్పటికి మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎంపీడీఓ తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడంతో పలు పంచాయతీలకు చెందిన ఏడుగురు రాజీనామాలు చేశారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు ప్రతి రోజు ఫోన్ చేసి ఫీల్డ్ అసిస్టెంట్లచే రాజీనామాలు చేయించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మంగళవారం ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిపించి ఆ విషయం చెప్పారు. మండలంలో 58 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు ఉండగా దాదాపు మండలంలో 15 మంది కార్మికులచే రాజీనామాలు చేశారని సమాచారం. ఇంకా ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు రాజీనామాలు చేయని వారిపై ఎంపీడీఓ, ఎంఈఓలు ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి పురస్కారం అందుకుంటున్న వైష్ణవి

పుల్లలచెరువు బాలికకు సీఎం రేవంత్ సత్కారం


కూచిపూడి నృత్య ప్రదర్శనలో వైష్ణవి

పుల్లలచెరువు: ఎక్కడో మారుమూల గ్రామమైన పుల్లలచెరువుకు చెందిన బాలికకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా సన్మానం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. పుల్లలచెరువుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కె.జానకి రఘు ముద్దుల కూతురు వైష్ణవి చిన్న తనం నుంచే కూచిపూడి నృత్యం నేర్చుకుని పలు దేశాలు, పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తోంది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆ రాష్ట్ర ప్రభుత్వం తరపున జరిగిన కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో పలు పదర్శనలు చేయగా దానిలో వైష్ణవి ప్రదర్శించిన నృత్య ప్రదర్శనకు మొదటి బహుమతి వచ్చింది. వైష్ణవిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన చేతుల మీదగా చిన్నారి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బాలికను అభినందించారు.

స్వాతంత్ర్య వేడుకలకు దొనకొండ విద్యార్థి


విద్యార్థి, ఉపాధ్యాయునితో హెచ్‌ఎం

దొనకొండ: ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు దొనకొండ జెడ్పీ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు పీఎంశ్రీ పాఠశాలలు ఎంపిక కాగా ప్రకాశం జిల్లా నుంచి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొనకొండ ఎంపికైంది. ఈ పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థి పి.హర్షసాయినాథ్, గణిత ఉపాధ్యాయుడు చాంద్ బాషా ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులుకు జిల్లా విద్యాశాఖాధికారి తెలియజేశారు. వీరు 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాంతంత్ర్య పాల్గొంటారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

దొనకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పొందాలని గౌతమి కళాశాల అడ్మిన్ నాని తెలిపారు. మంగళవారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. మొక్కలు నాటితే రేపటి తరాలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వకున్నా ఆక్సిజన్ చెట్లతో పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలని, నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో శామ్యూల్ జాన్

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో శామ్యూల్ జాన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సి. కొత్తపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. పిల్లలతో రాయించడం, చదవించడంతో పాటు వారి నోట్ పుస్తకాలను రోజూ చూసే విధంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూను పాటిస్తూ రుచికరంగా ఉండాలని, ఉపాధ్యాయులు కూడా రోజూ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు ఒడ్డించాలని చెప్పారు. ఉపాధ్యాయులు అశ్రద్ధ చేయకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు.

నవత ట్రాన్స్‌పోర్ట్‌లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నవత ట్రాన్స్‌పోర్ట్‌లో తనిఖీలు నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ తెలిపారు. తనిఖీల్లో పురుగు మందులు, విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఏయే డీలర్‌కు గత నెల రోజుల నుంచి వచ్చిన సరుకులను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీసీసీ బ్యాంకుకు సంబంధించి కౌలు రైతులకు క్రాప్ లోన్లను మంజూరు చేసేలా చూడాలని బ్యాంకు అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు.

ఒలింపిక్‌లో విజయం సాధించాలి

యర్రగొండపాలెం: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో భారత దేశం నుంచి వెళ్లిన క్రీడాకారులు విజయం సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని స్థానిక డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం వద్ద విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఖోఖో కోచ్ లక్ష్మీనారాయణ, పీఈటీ సుబ్బారావు పాల్గొన్నారు.